క్లుప్తంగా

ఆలయానికి రూ.21వేల విరాళం



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామస్వామి గుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయానికి వేములకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పి.రవీందర్‌గౌడ్ మంగళవారం రూ.21,116లను విరాళంగా అందజేశారు. గుట్టపైకి వెళ్లే దారిలో సీసీరోడ్డు వేయిస్తున్నందున దాతలు సహకరించాలని ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ అస్కని నరేందర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండయ్య, అశోక్ రెడ్డి, ఆలూరి గోపి, అస్కని నర్సింహసాగర్, గోవింద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వేదవ్యాసుడి జయంతి



చిన్నచింతకుంట: తిరుమలాపురంలో వేదవ్యాసుడి జయంతిని ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ యువకులు, తదితరులు హాజరై మహర్షి చిత్రపటానికి పూజలు చేశారు. పుట్ట అంజన్న తదితరులు మాట్లాడారు.

ఆర్టీసీ డిపో ఎదుట పీడీఎస్‌యూ ధర్నా



నారాయణపేట రూరల్: విద్యాసంస్థల వేళలకు సరిపడా బస్సులను నడిపించడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పేట డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ మేరకు.. జిల్లా సహ కార్యదర్శి గౌస్, వెంకటేష్ మాట్లాడుతూ.. కోటకొండ రహదారి పనులు జరుగుతున్నాయనే కారణంతో భూనేడ్, తిర్మలాపూర్ రెగ్యూలర్ సర్వీసులను నిలిపివేశారని వాపోయారు. అదేవిధంగా పగిడిమారి, జలాల్‌పూర్‌లకు సమయానికి సరిపడా బస్సులు నడిపించాలని కోరారు. విద్యార్థుల జీవితాలతో చలగాటం ఆడటం మానుకోవాలని, డీఎం మొండి వైఖరి విడనాడకపోతే డిపో భారీ ఆందోళన చేపడుతున్నట్లు హెచ్చరించారు. అనంతరం డీఎం లక్ష్మీసుధకు వినతిపత్రం అందించారు. మహేష్, మహిపాల్, లక్ష్మణ్, ప్రవీణ పాల్గొన్నారు.



నవాబుపేట మార్కెట్ యార్డు పక్కన రక్షణ కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్..



యన్మన్‌గండ్ల హాస్టల్ ప్రహరీ వద్ద ..



గుబ్బడిగుచ్చ తండాలో శిథిలమైన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె



చౌడూర్‌లో..

పొంచి ఉన్న ప్రమాదం..

నవాబుపేట: మండల పరిధిలో పలు చోట్ల రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాటి చుట్టూ కనీసం కంచెకూడా లేకుండా పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఆయా చోట్లు పరిస్థితి ఇలా..

■ మండల కేంద్రంలో ఎస్‌బీఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు పక్కనే ఎలాంటి రక్షణ లేకుండా ఉంది. అదేవిధంగా మార్కెట్ యార్డుకు ఆనుకుని మహబూబ్‌నగర్ రోడ్డు పక్కనే మరో ట్రాన్స్‌ఫార్మర్ సైతం ప్రమాదభరితంగా మారింది. ఇటీవల మూగజీవులు సైతం రెండు పర్యాయాలు ఇక్కడ ప్రమాదాలకు గురై మృతి చెందాయి.

■ రేకులచౌడాపూర్ సమీపంలో గుబ్బడిగుచ్చతండాలో గ్రామానికి ఆనుకుని రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలు శిథిలమైపోయాయి. దీంతో దిమ్మెలు ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

■ యన్మన్‌గండ్ల బాలుర హాస్టల్ ప్రహరీకి ఆనుకుని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ సైతం కంచెలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

■ చౌడూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె వానకు కూలిపోయే పరిస్థితి ఉంది. ఇలా చాలాచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఇలాంటి పరిస్థితే కనిపిస్తోంది. అయినా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా మేల్కొని ఎలాంటి ప్రమాదాలు జరగక ముందే సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



నవాబుపేట బ్యాంకు సమీపంలో..

ఘనంగా బోనాల పండుగ



అప్పంపల్లిలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

చిన్నచింతకుంట: చిన్న వడ్డేమాన్, అప్పంపల్లి గ్రామాల్లో బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామాల్లోని వీధుల్లో వేపాకు తోరణాలు కట్టారు. మహిళలు బోనాలను తలపై ఉంచుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి పంటలు మంచిగా పండాలని వేడుకున్నారు.

ఉపాధ్యాయులకు ఘనంగా వీడ్కోలు



సన్మానం పొందిన ఉపాధ్యాయులు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం జనతా పరివార్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వారు ఇక్కడ చేసిన సేవలను కొనియాడారు. కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు. మంచిగా పనిచేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సరస్వతి, మాజీ ఎంపీటీసీలు గౌస్, సంపత్ కుమార్, రాజేశ్వర్, జహంగీర్, పర్వతాలు, శివ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పనుల ప్రగతి పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా సమీపంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల మైనార్టీ గురుకుల పాఠశాలను ఎంపీడీఓ వెంకట్‌ప్రసాద్ మంగళవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ప్రగతిని పరిశీలించారు. నూతన టాయిలెట్ల నిర్మాణం, పాతవి మరమ్మతుతోపాటు నీటి సౌకర్యం కోసం స్లంప్ నిర్మాణం, విద్యుత్ తదితర పనులపై ఆరాతీశారు. త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మొదటి విడతలో 40 పాఠశాలలు ఎంపిక అయినట్లు తెలిపారు. 39 పాఠశాలల్లో పెయింటింగ్ మినహా అన్ని పనులు పూర్తయినట్లు వివరించారు. జయప్రకాష్‌నగర్‌లో మాత్రం పనులు చేపట్టలేదని అన్నారు. అక్కడ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ కింద ఓ కంపెనీ పాఠశాల నిర్మాణానికి ముందుకు వచ్చిందన్నారు. రెండో విడతలో 15పాఠశాలలు మంజూరయ్యాయని వివరించారు. వీటిలోనూ 13 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని అన్నారు. కేజీబీవీ, గంగాపురం ప్రాథమిక పాఠశాలల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రెండింటిలోనూ త్వరలోనే పనులు పూర్తవుతాయని వెల్లడించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ కుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని కందూర్‌కి చెందిన వడ్డె శాంతమ్మ మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని మంగళవారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. శాంతమ్మ మృతదేహంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం బాధితకుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మున్నూర్ వెంకట్రాములు, వెంకటేష్, ఆంజనేయులు, బాలయ్య, పెద్ద బాలయ్య తదితరులు ఉన్నారు.

సీఎంను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీఎన్‌జీఓ నాయకులు కలిశారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌యాప్ ద్వారానే బిల్లు చెల్లించండి



జడ్చర్ల టౌన్: ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలనుకునే వారు ఇకపై తమ శాఖకు చెందిన టీజీఎస్‌పీడీసీఎల్ సిటిజన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని.. దాని ద్వారానే బిల్లులు చెల్లించాలని జిల్లా విద్యుత్ రెవెన్యూ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బీచుపల్లి సూచించారు. మంగళవారం జడ్చర్ల విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటి వరకు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి వాటి ద్వారా వచ్చిన బిల్లుల గురించి ఆరా తీశారు. వినియోగదారులను చైతన్య పర్చాలని సిబ్బందికి సూచించారు. ఇతర యాప్‌ల ద్వారా బిల్లు చెల్లింపు సరికాదన్నారు. జడ్చర్ల ఏఓ హరిచందర్ ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి..



నారాయణపేట రూరల్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సాయిబన్న మాట్లాడుతూ.. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని, రైతు బరోసా కింద ఎకరాకు రూ.15వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటయ్య, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్, శివప్ప, కృష్ణ, కార్తీక్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మరమ్మతు పనులు



మరమ్మతు పనులకు సహకరిస్తున్న విద్యార్థులు

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గర ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం రంగయ్య విద్యార్థులతో గేటు మరమ్మతు పనులు చేయిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇనుప బోర్డు ఏర్పాటు చేసేందుకు విద్యార్థులకు గేటుపై నుంచి గోడపై ఎక్కించి పనులు చేయించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో జోరుగా పోస్టులు పెట్టి చర్చలు సాగాయి. హెచ్‌ఎం రంగయ్యను వివరణ కోరగా పాఠశాలకు చెందిన బోర్డు విరిగిపోయి దిమ్మె పడటంతో ప్రమాదభరితంగా ఉందన్నారు. గ్రామానికి చెందిన వెల్డర్ వారం రోజుల నుంచి చెప్పినా రాలేదన్నారు. మంగళవారం రావడంతో బోర్డు పట్టుకోవడానికి మాత్రమే విద్యార్థులు గోడపై నిలబడ్డారని వివరించారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన

మహబూబ్‌నగర్ రూరల్/గండేడ్/అడ్డాకుల: ఖమ్మం జిల్లా అశ్వారావు పేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకోవడానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు అన్నారు. బాధ్యులను వెంటనే ఉద్యోగం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని కోరారు. మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆయా మండల కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. శ్రీనివాస్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. గండేడ్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు బోరు కృష్ణయ్య, వివేకానంద, చెన్నప్ప, మలక్కయ్య, చిన్న నరసయ్య, ఆంజనేయులు, శ్రీనివాస్, సాయిలు, నర్సింలు, వెంకటయ్య, అడివయ్య, మైబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అడ్డాకులలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునగలశెట్టి బాలరాజు, మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్, కేవీపీఎస్ నాయకులు ప్రసాద్, దేవిపుత్ర, శ్రీకాంత్, యాకూబ్, డేవిడ్, బాలనాగన్న, దేవన్న తదితరులు పాల్గొన్నారు.



గండేడ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

జిల్లాకేంద్రంలో..

జిల్లాకేంద్రంలో నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అశ్వారావుపేట ఎస్‌ఐ మృతికి కారకులైన వారిని, అదేవిధంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని మోతినగర్ ఆంజనేయస్వామి ఆలయంలోకి దళిత వెంకట్రాములును రానివ్వకుండా అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు, కార్యదర్శి ఎం.కుర్మయ్య మాట్లాడారు. ఇంకెన్నాళ్లు కుల వివక్షత అంటూ న్యూ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, నాయకులు మహేందర్, భరత్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బోధనాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



విద్యార్థులతో మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్, ఉపాధ్యాయులు

నవాబుపేట: ఉపాధ్యాయులు బోధనాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి రాజునాయక్ తెలిపారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని ఇప్పటూర్, చెన్నరెడ్డిపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు. అనంతరం చెన్నరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్స్ అందించారు. అనంతరం మాట్లాడారు. ఉపాధ్యాయులు నూతన విధానాలకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాములు, మహేష్, శ్యాంసుందర్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, సీఆర్‌పీ జనార్దన్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటాలు



ప్రసంగిస్తున్న స్వామి

జడ్చర్ల టౌన్: ఏబీవీపీ విద్యారంగ సమస్యలపై మరింతగా పోరాటాలు చేయనుందని ఎస్‌ఎఫ్‌డీ ప్రముఖ్ స్వామి అన్నారు. ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని నగరశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 75ఏళ్లుగా విద్యారంగ సమస్యలపై పోరాడుతూనే జాతీయ సమైక్యతకు ఏబీవీపీ పాటుపడిందన్నారు. దేశానికి పటిష్టమైన నాయకత్వాన్ని సైతం ఏబీవీపీ అందించిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో జెండాను ఆవిష్కరించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా కన్వీనర్ వీరమోహన్, జడ్చర్ల కన్వీనర్ మణిరవీంద్ర, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాయికుమార్, నగర కార్యదర్శి రాఘవేంద్ర, భాగ్యశ్రీ, రంజని, శృతి, నవనీత, నవ్య, పద్మావతి, శివ, అజయ్, వంశి, నరేష్‌లు పాల్గొన్నారు.

గుంతలమయంగా రహదారులు



భూత్పూర్ నుంచి గోప్లాపూర్ వెళ్లే దారిలో ఏర్పడ్డ గుంతలు



కర్వెన వెళ్లే దారిలో గుంతల్లో నిలిచిన నీరు

భూత్పూర్: మండలపరిధిలో పలు రహదారులు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల నేపథ్యంలో గుంతల్లో నీరు నిల్వడంతో మరింతగా అవస్థలు పడుతున్నారు. భూత్పూర్ నుంచి కర్వెన వెళ్లే మార్గంతో పాటు గోప్లాపూర్ వెళ్లే దారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రాత్రివేళల్లో గుంతలు గుర్తించలేక ద్విచక్రవాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈనేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా మరమ్మతు పనులు చేపట్టి రోడ్ల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



కుంటను తలపించిన జడ్చర్ల ఆస్పత్రి ఆవరణ

నియోజకవర్గల కేంద్రంలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి స్థానికంగా ఉన్న వంద పడకల ఆస్పత్రి ఆవరణలో ఒక్కసారిగా వరద నీరు వచ్చి చేరింది. ప్రాంగణం మొత్తం నీటితో నిండి కుంటను తలపించింది. నీరు నిల్వడంతో రాకపోకలకు ఇబ్బంది మారింది. మంగళవారం ఉదయం ఆవరణలోని వరద నీరు నెమ్మదిగా పక్కనే ఉన్న నాలా ద్వారా వెళ్లడంతో యథావిధిగా మారింది. కానీ భారీగా వర్షం వస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

– జడ్చర్ల

ఇంటింటికీ మొక్కల పంపిణీ

జడ్చర్ల టౌన్: వనమహోత్సవంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ 6 మొక్కలు పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం కిష్టంపల్లిలో ఎంపీఓ జగదీశ్ కార్యక్రమం చేపట్టారు. దానిమ్మ, జామ, బొప్పాయి, గన్నేరు, మునగ, మందార మొక్కలు అందిస్తున్నట్లు వివరించారు. మండలంలో 65వేల మొక్కల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ తదితరాల ద్వారా మొత్తం 3.20 లక్షల మొక్కలు మండలంలో నాటాలని లక్ష్యం నిర్ణయించినట్లు వివరించారు. ఇప్పటికే 85వేల మొక్కలు నాటినట్లు వివరించారు. ఇంటింటికి అందజేస్తున్న మొక్కలను పరిరక్షించాల్సిన బాధ్యత యజమానులదేనని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల తరలింపు...

దేవరకద్ర: మండల కేంద్రంలోని మెగా పకృతి వనంలో ఉన్న వన నర్సరీ నుంచి మంగళవారం మొక్కలను తరలించారు. వివిధ రకాల మొక్కలను ఇక్కడి నుంచి ట్రాక్టర్‌లపై పట్టణం చుట్టు పక్కల ఉన్న నివాసాలకు, రహదారుల పక్కన నాటడానికి పంపించారు.



కిష్టంపల్లిలో మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీఓ



దేవరకద్రలో మొక్కల తరలింపు